# దొరగారు - దివాన్జీ

(కృష్ణాపత్రిక - 3.4.1954)

దేవుడు వరమిచ్చినా, పూజారి వరమివ్వనట్టున్నది. అంతేకాదు. దేవుడు, వరమిచ్చే దేవుడు అడగటం ఆలస్యంగా ఇస్తాడు. పూజారి ఆ వరానికి అమలు జరగనివ్వడే! చిలకల పేటలో రైతులు మూడేండ్ల శిస్తులు బకాయి పడ్డారు. వాళ్ళని దివాకరరావు నానాతిప్పలు పెట్టాడు. వాళ్ళందరూ పేద రైతులు. పోయి దొరగారితో చెప్పుకున్నారు. దొరగారు సగానికి సగం రాయితీ చేశారు. చేశాడన్న ఫలితమేమున్నది? దివాకరరావు దానిని సాగనీయలేదు. అంతా యిమ్మన్నాడు. దొరగారు సగం రాయితీ జేశారయ్యా అంటే ఆ సంగతి తనకు తెలియదంటాడు.

మళ్ళీ దొరగారితో పోయి చెప్పుకొన్నారు. ఆయన దివానుకు కాగితం వ్రాశారు. అదీ బుట్టదాఖలే అయింది.

ఈ సంగతి అందరికీ తెలుసు. దొరగారి దగ్గరకు వెళ్ళి ప్రయోజనం లేదని, ప్రయోజనం లేదంటే వున్నది. ఆయన ధర్మరాజు. అంతటి జాలిగుండె గలవాడు లేదు. ఏకపత్నీవ్రతుడు. అబద్ధం కలలోనైనా ఆడడు. ధనవంతుడూ, పేదవాడూ అనే భేదం లేదు. ఆ దొరగారికి కోపం రావటం అనేది ఎవరూ యెరుగరు. ఆయన కన్ను ఒక పేదవాని మీద పడితే ఆ పేదవాడు ధనవంతుడైనాడన్న మాట. ఆయన అనంత సద్గుణగుణాంభోది. మరి ఆ జమీలో ఆయన శీలాన్ని గురించి చాల ప్రతిష్ఠ. ఎందుకంటే సామాన్యంగా దొరలు తక్కిన మంచి గుణాలు ఉన్నా యేకపత్నీవ్రతులు మాత్రం యెవ్వరూ కారు. ఆయనకు నలభై ఏండ్లు వచ్చేవరకూ బ్రహ్మచారి. ప్రజలందరూ వెళ్ళి ఆయన్ను ప్రార్థిస్తే వివాహం చేసుకున్నాడు. చేసుకున్న తరువాత పదేళ్ళకాయనకు సంతానం కలిగింది. దొరగారికి ఇప్పుడు డెబ్భై ఏళ్ళు. యువరాజుకు ఇరవైయేండ్లు. దొరగారి బొమ్మ. దేవుడి బొమ్మ వలె పెట్టి ఆ పరగణా పరగణా అంతా పూజిస్తూ వుంటారు. రెండు మూడు వూళ్ళల్లో ఆయన శిలా విగ్రహాలు కూడా వేశారు. ఆయన సర్వసద్గుణాలకు మించిన యేకపత్నీవ్రతం చెప్పినవాడు చెప్పకుండా చెప్తూతూ వుంటాడు.

దివాకరరావు దివాన్జీ. ఆయనకు సుమారు ముప్ఫైఏండ్ల పైన వుంటవి. ఆయన పదిహేను ఏండ్ల బట్టి దివాన్జీగా వచ్చాడు. ఈ పదిహేనేండ్లు ఎండ కాయటమే తప్ప తగ్గటమే లేదు. ఈ దివానుగారి మీద వందల మీద వందలు ఫిర్యాదులు వెడతాయి. దొరగారి వద్దకు దొరగారు వింటారు. సామాన్య విషయాలైతే "కొండయ్యా! ఆ దివానుగారు వింటం లేదంటాడు. పెద్ద పెద్ద విషయాలైతే తాను వారికి అనుకూలంగా వ్రాస్తాడు. ఆ వ్రాసిన వాటిల్లో ఒకదానికీ అమలు జరుగదు. అంతదాకా యెందుకు? ఒకప్పుడొక కవి వచ్చాడు. దొరగారాయనకు వెయ్యి రూపాయలిమ్మని దివానుగారికి వ్రాశాడు. దివానుగారు ఏణ్ణర్థం తిప్పాడు. ఆ కవిగారికి విసుగుపుట్టి మానేశాడు. పోయి దొరగారితో చెప్పుకుందామనుకున్నాడు. "ఎందుకయ్యా అనవసరం. ఆయన మళ్ళీ కాగితం వ్రాస్తాడు. ఈయన మళ్ళీ బుట్టదాఖలు చేస్తాడు. ఊరుకో" మన్నారు నలుగురూ.

ఒక్కొక్కప్పుడు – దొరగారూ దివాన్జీగారూ ఒకటేను; కలిసి ఈ నాటకం ఆడుతున్నారని అనుకోటానికి చాల వీలున్నది. కాని ఆ పరగణాలలో ప్రజలు ఒక్కరైనా అట్లా అనుకోరు. ఎందుకంటే? దొరగారి గుణసంపత్తి అందరికీ తెలుసు. పైగా అలా అనుకోటానికి ఏమీ వీలులేదు. కొన్ని కొన్ని విషయాలలో దొరగారు తన సొంతడబ్బు యిస్తాడు. ఒకసారి రాసంపాటి రైతులు కాలువ త్రవ్వించుకోవాలని 'తబిరీకు' (తఫ్‌రీఖ్) వేసుకున్నారు. వాళ్ళకు చాలలేదు. దొరగార్ని అడుగుదామనుకున్నారు. దొరగారు వెయ్యిరూపాయలు వేశాడు. దివాకరరావు దమ్మిడీ చెల్లుబడి కానివ్వలేదు. ఆ ఠాణా మీది కెళ్ళి వసూలు చేయమంటాడు. పోయి, ఠాణాదార్ల నడిగితే 'ఆయన రహస్యంగా మాకు ఇవ్వద్దని చెప్పాడయ్యా' అన్నారు.

నాలుగైదు నెలలు గడిచాయి. ఆ రైతులు పోయి దొరగారితో చెప్పుకున్నారు. దివానుగారి మీద ఇలాంటివి వంద విషయాలు. దివాకరరావు మీద ఎన్ని చెప్పాలో అన్నీ చెప్పారు. ఈ దివాను మీకు పనికి రాడన్నారు. అయ్యా! చంద్రుడిలో మచ్చ చంద్రుడికి శోభ. మీకు ఈ దివాన్జీ శోభ అన్నారు. దొరగారు నవ్వుతాడు. ఊరుకొంటాడు. మరీ కోపం వస్తే కాగితం తీసుకొని వ్రాస్తాడు. దాంతో దొరగారి కోపం పూర్తయి వూరుకొంటుంది. కాని ఈ రాసంపాటి రైతుల వ్యవహారం వూరి మీది వ్యవహారం. వ్యక్తి విషయం కాదు.

అందులో కొందరు సంపన్నులైన రైతులు గూడా వున్నారు. వాళ్ళు తెగబడి దివాకరరావును ఎన్ని మాటలనాలో అన్నిమాటలూ అన్నారు. రాజుగారు ఆ వెయ్యి రూపాయలు తన చేతిలోనుంచి యిచ్చాడు. ఇలా చాలా మొత్తాలు దొరగారి చేతిలో నుంచి ఇచ్చినవి వున్నాయి. అలాంటప్పుడు దొరగారు దివానుగారితో షరీకని చెప్పటమెలాగ?

మరీ ఒకప్పుడు దొరగారు రాణీగార్నించి అప్పు తెచ్చి ఇలాంటి ఒక ధర్మాన్ని పాలించాడు. కనుక ఆ ప్రభువు నిష్కళంకుడు. ఆయనకు వున్న కళంకం ఈ దివాను ఒక్కడే.

మరి దివానును ఎందుకు తీసివేయడు?

ఆ దేవిడీలో ఒకసారి ఉద్యోగం యిస్తే మళ్ళీ తీసివెయ్యటం ఎప్పుడు జరిగింది? వాళ్ళు పడితింటూ ఉండడమే! ఆలనాపాలనా లేదు. అదుపూ ఆజ్ఞా లేదు. ఇలా చాలా దుర్మార్గాలు చేసిన ఉద్యోగుల్ని రెండు మూడు వందల ఏండ్ల మీద ఒకటిరెండు సార్లు ఆ దివాణంలో తీసివెయ్యటం వున్నది.

పూర్వం ఒక 'నిఘామాను' వాడే జమీందారల్లే నటించాడు. ఐదారు ఏళ్ళు వాడి ఆటలు సాగినాయి. ఈ దొరగారే వాణ్ణి తీసివేశాడు. తీసివేశాడు. కాని వాడి జీవితాని కంతకూ సరిపోయే ఆస్తి యిచ్చాడు. అలాగే ఈ దివానుకూ ఇచ్చుకోమనండి. ఎవరు వద్దన్నారు? పైగా దివాకరరావు ఎన్నిసార్లో అన్నాడు గదా "ఆయన దొరగారేమిటి, నేనే దొరగా" రన్నాడు. ఈ సంగతే దొరగారికి తెలిసి "ఆహా అలా అన్నాడా? మరి ఆయనే జమీందారుగారు కాబోలు" అని నవ్వాడు.

పరగణాలో జరిగే ఈ విషయాలు అలా అట్టేపెట్టండి. రాణిగారికి డబ్బు కావలిస్తే దిక్కులేదు. దివాను ఇస్తే ఇచ్చినట్లు ఇవ్వకపోతే ఇవ్వనట్లు, కాని పరగణా అంతా ఈ దివాను పోతేగాని తమకు బ్రదుకుదల లేదనిపించింది. దొరగారివల్ల ఏమీ లాభం లేదు. యువరాజుగారికి ఇరవై ఏండ్లు వచ్చాయి. ఆయన ఆధునిక విద్యావిధానంలో ఆరితేరాడు. ఆయన రావాలి, పరగణా కొత్త పంపిణీ మీద నడవాలి అనుకున్నారు. ఆయన కత్తి వంటివాడు. ఏద్తైనా మాట్లాడినా సరే, చేసినా సరే ఖచ్చితంగా చేస్తాడు. తండ్రి అంటే మహాభక్తి.

'నాయనగారిని దాటిపోనీయండి, జమీందారీ నా చేతిలోకి వచ్చిన మర్నాడు ఈ దివాను ఉండడు' అన్నంత తీక్షణత కనిపిస్తుంది. నోటితో 'తండ్రి దాటిపోవటం' అనలేదు.

కాని ప్రజలకు బాగా ధైర్యం కలిగింది. యువరాజు జమీందారు అయిన మర్నాడు దివానుగారికి 'యత్తేయజ్ఞం' తప్పదు.

దొరగారికి జబ్బు చేసింది. ఆయన పరమపదించారు. కాని యింకా పదినిమిషాలకు ప్రాణం వదలుతారనగా తన గదిలో యెవరూ వుండగూడదన్నారు. ఒక్క యువరాజునే వుండమన్నారు. ఆయనతో యేదో రహస్యం చెప్పారు. ఆ రహస్యం ఏమిటో యెవరికీ తెలియదు తప్ప ఏదో రహస్యం చెప్పారని నూటయాభై గ్రామాల్లోనూ తెలుసు.

తర్వాత నాల్గు నెలలకు యువరాజుకు పట్టాభిషేకము చేశారు. పట్టాభిషేకపు ఖర్చులలో దివాను యేమీ జోక్యం కల్పించుకోలేదు. అందరూ బ్రతకనేర్చిన ముండావాడన్నారు. క్రొత్త పరిపాలన ప్రారంభించింది.

ఏడాది, ఏణ్ణర్థం గడిచేటప్పటికి మళ్ళీ పాత తతంగమే మొదలుపెట్టింది. రాజాగారి అనుజ్ఞ అవడమే తప్ప మంత్రిగారి దగ్గర లక్ష్మి పలుకదు. మళ్ళీ దొరగారి దగ్గఱ ఫిర్యాదులు ప్రారంభించినవి ఈ దొరగారికి చాలా కోపం వస్తుంది. ఈయనా ఏమీ చేయడు. పెద్ద దొరగారికీ యీ దొరగారికీ ఒకటే భేదం. మంత్రి మీద ఫిర్యాదులు చెపితే పెద్ద దొరగారు నవ్వేవాడు. ఈయనకు కోపం వస్తుంది. ఇంతే భేదం. దివాకరరావు ఉద్యోగం అప్పుడూ భద్రంగానే ఉంది; ఇప్పుడూ భద్రంగానే ఉంది;. ఆటలు అప్పుడూ భద్రంగానే సాగాయి, ఇప్పుడూ భద్రంగానే సాగుతున్నాయి.

ఈ దొరగారి వివాహం అయింది. ఆవిడ యింతకంటే పెద్ద జమీందారు పిల్ల. బాగా చదువుకొన్నది. ఘోషా మొదలైనవి తీసేసింది. ఊరివెంట గుర్రపు షికారు వెడుతుంది. టెన్నీసు ఆడుతుంది. ప్రజలు తమ పనులేమైనా ఉంటే ఆవిడతో కూడా పోయి మనవి చేసుకోవచ్చు. ప్రజలు యీ దొరతో లాభంలేదని విసిగిపోయి దివానుమీద ఫిర్యాదులు ఆవిడతోనూ చెప్పడం మొదలు పెట్టారు. ఆవిడ చాలాసార్లు భర్తతో మాట్లాడింది. ఆయన ఏమీ సమాధానం చెప్పలేదు.

ఇది యిలా ఉండగా ఆ దొరగారు సాగించే కొన్ని పాఠశాలలు ఉన్నాయి. ఒక పాఠశాలాధ్యక్షుడు, దివానుకు దగ్గర చుట్టం. అతను ఆ పాఠశాలను ఎంత అధ్వాన్నంగా చెయ్యాలో అంత అధ్వాన్నంగా చేశాడు. అతడావూళ్ళో విశృంఖలంగా ప్రవర్తిస్తున్నాడు. అతన్ని తీసివేయక తప్పదని పూర్వపు దొరగారితోనూ చెప్పారు. ఇద్దరు దొరలూ అతన్ని తొలగించవలసిందని ఆయన పదిసార్లు ఈయన పదిసార్లు ఆజ్ఞాపత్రాలు పంపారు. ఆయన మాత్రం అక్కణ్ణించి కదల్లేదు. *వడ్డించేవాడు మనవాడైతే కడపంక్తిన కూర్చున్నా ఫరవాలేదన్నట్లుంది* వాడి స్థితి. ఆ వూరి రైతులు ఆ పాఠశాల వార్షికోత్సవానికి చిన్నరాణిగారిని తీసికెళ్ళి ఆవిడ చేత పిల్లలకు బహుమానాలిప్పించారు. ఆవిడ పాఠశాల చూచింది. ఆ అధ్యక్షుడి మూలంగా బడి అంతా అల్లకల్లోలంగా వుందని తెలుసుకుంది. పిల్లలకు ఉపాధ్యాయుడంటే గౌరవం లేదు. ఊళ్ళో అతనంటే లెక్కలేదు.

ఇంటికి తిరిగివచ్చి భర్తతో చెప్పింది. అతన్ని తీసి వేయాలని పట్టుబట్టింది.

అతన్ని తీసివెయ్యాడానికి ముందు దివాన్ని తీసివెయ్యాలి.

దివానునే తీసివెయ్యమని పట్టుబట్టి కూర్చుంది.

ఇలా నాలుగురోజులు గడిచాయి.

చివరకు రాణీగారు ఐదవరోజున దొరగారిని నిగ్గదీసి అడిగింది.

దొరగారు 'ఇదియొక రహస్యం' అన్నాడు.

చివరకు చెప్పక తప్పింది కాదు! 'మానాయనగారు చనిపోయేముందు నా కీ రహస్యం చెప్పారు.'

"ఏమిటా రహస్యం?"

'మా నాయనగారికి నలుబదవయేట పెండ్లయినది.'

"దానికీ దీనికీ యేమి సంబంధం?"

"ఆ దివాను నాకు అన్నగారు".